

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



## - పదకొండవ కథ -

**చాలా ఏళ్ళ క్రితం**, ఒక పెద్దహాస్పిటల్ లో పని చేసేరోజుల్లో.......

హాస్పిటల్ లో ఒక కేసు చూడడానికి మధ్యాహ్నం ఒంటిగంటకు వెళ్ళాను. కేసు పెద్దగా టైం పట్టలేదుగానీ, బంధువుల కోపాలు చల్లార్చడానికి చాలా టైం పట్టింది. దాదాపు నాలుగున్నరకు ఫ్లాట్ కు తిరిగి వస్తూ వంట తప్పించుకునే మార్గాలు వెతుకుతూ, ఇంట్లో తినడానికి ఏమున్నాయో ఆలోచిస్తున్నాను. తలొంచుకుని నడుస్తుంటే, ఎవరో కాళ్ళకడ్డం పడినట్లు తెలిసి గబుక్కున పట్టుకున్నాను.

ఏడేళ్ళ పాప.

మేముండే ఫ్లాట్స్ చుట్టూ బాగా విశాలమైన పచ్చిక మైదానాలుండడం వల్ల సాయంకాలమైతే చాలు, చుట్టుపక్కల పిల్లలు ఆడుకోవడానికి వస్తారు. ఆమె పడిపోకుండా పట్టుకున్నాను. చేతిలో ఒక చారల బంతి ఉంది. దాన్ని చేతిలో ఉంచుకునే నావంక ఆశ్చర్యంగా చూస్తోంది.

పిల్లలంతా నా వంక వింతగా ఎందుకు చూస్తారో నాకర్థం కాదు. తల్లితో పాటు నా క్లినిక్ కు వచ్చే పిల్లల కళ్ళల్లో భయం, ఆశ్చర్యం , ఇంకా ఏవో తెలియని భావాలను చూస్తూనే ఉంటాను. "ఏంటి నా మొహంలో ప్రత్యేకత?" అని నా ఫ్రెండ్స్ ని అడిగితే, “నీ మొహం ప్రత్యేకత, అదేంకాదు డాక్టర్లందర్నీ అలాగే చూస్తారు. డాక్టర్లంటే పిల్లలకు భయం" అని చెప్పారు.

ఆ పాపకూడా అలాగే చూస్తుంది. ఆ పాపను చేతిని పట్టుకుని “నీ పేరేంటి?" అడిగాను.

బదులు చెప్పలేదు.

దూరంగా ఓ పాతికేళ్ళ యువతి పరుగులాంటి నడకతో వచ్చి మమ్మల్ని కలుసుకుంది.

"నూర్ కు మాటల్రావు" అంది నవ్వుతూ.

పాప పేరు నూర్. నూర్ అంటే వెలుగు.

"మాటలు రావా? మరి చూపెట్టారా?"

"ఇంకా చిన్నపిల్లేగా, వచ్చినప్పుడే వొస్తయ్యి” అంటూ అక్కడ క్రికెట్ బాల్ పడితే అది తీసి వికెట్స్ వేపు విసిరేసింది ఆమె.

నూర్ బుగ్గ రెండు వేళ్ళతో సున్నితంగా పట్టుకుని ముద్దు చేశాను. కొద్దిగా పాలిపోయిన బుగ్గలు. ఎడమ బుగ్గమీద ఏదో అస్పష్టమైన చార. జలుబు చేసిందేమో, నోరు తెరుచుకుని గాలిపీల్చుకుంటోంది. ఎర్రటి జుట్టు. పైనుండి కింది వరకు వేళాడుతున్న లాంగ్ స్కర్ట్.

" చిన్న పాపకు అంత పొడుగు డ్రెస్ ఎందుకూ. ఆడుకుంటే పడిపోదూ...."

యువతి జవాబు చెప్పకుండా, నవ్వుతూనే ఉంది

నేను వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ వెనక్కి తిరిగి చూశాను. నూర్ చేతిలో బంతి పట్టుకుని నావంకే చూస్తోంది. నేను బై చెప్తున్నట్టు చెయ్యూపాను. ఆమె తిరిగి చెయ్యూపలేదు.

❦❦❦

నేను హాస్పిటల్ కు వెళ్తున్నప్పుడో, తిరిగి వస్తున్నప్పుడో, పిల్లలు గడ్డిలో ఆడుతున్నప్పుడు నా కళ్ళు నూర్ కోసం వెతికేవి. నూర్ కనిపించినపుడు నవ్వుతూ చెయ్యూపేదాన్ని.డిశ్చార్జ్ అయిపోయిన పేషంట్లు వెళ్తూ వెళ్తూ బిడ్డ పుట్టినందుకు చాక్లెట్లు ఇచ్చేవాళ్ళు . దారిలో కనిపించే పిల్లలకు ఇచ్చేదాన్ని. నూర్ , ఆమెతో ఉన్న యువతి కూడా పిల్లలతో బాటే చాక్లెట్ తీసుకునేవాళ్ళు. ఆమె నూర్ కు ఏమవుతుంది.

అందరూ 'థాంక్సాంటీ' అనేవాళ్ళు నూర్ తప్ప. కళ్ళలో అదే ఆశ్చర్యం కలసిన చూపు.

పిల్లలతో పెద్దగా కలవకుండా బంతి ఎగరేస్తూ , కిందవేస్తూ తనకు తోచినట్టు ఆడుకుంటూ కనిపించేది. నూర్ తో పాటే ఉన్న యువతి నూర్ తల్లేమో అనుకున్నాను కానీ ఆమె ప్రవర్తన చూస్తే తల్లికాదేమోననిపించేది. ఆ పచ్చికమీద తిరుగుతూ అల్లరితనంగా ఆడుకుంటూ ఉన్నట్టు కనిపించేది. లేదా క్రికెట్ ఆడే మగపిల్లలకు ఏదో సహాయం చేస్తున్నట్టు తనలోకం లో తను అన్నట్టు అటూ ఇటూ తిరుగుతూ ఉంటుంది. పాపను పెద్దగా పట్టించుకున్నట్లు అనిపించేదికాదు.

ఆ రోజు నాకు నైట్ డ్యూటీ ఉంది. తర్వాతిరోజు కూడా నాదే డ్యూటీ, జయశ్రీ షాపింగ్ కువెళ్ళాలని తన డ్యూటీకూడా నాకప్పగించింది. లంచ్ టైం దాటిపోయింది. అయిదింటికి ఫ్లాట్ కు వెళ్తుంటే, నూర్ ఆడుకోకుండా , తోడుగా ఉండే యువతి భుజం మీద కనిపించింది. దగ్గరకెళ్ళి "ఎత్తుకున్నారేంటీ, పాపకు వంట్లో బాగోలేదా?" అని ఆమెను పలకరించాను.

" నేను ఆడుకుంటున్నానని కోపం. ఎక్కి కూర్చుంది." అంటూ చెప్పింది. ఆ మాటల్లో ఫిర్యాదు తప్ప పెద్దరికం లేదు.

నూర్ ని బుగ్గ పట్టుకుని ముద్దు చెయ్యబోయాను.

భుజమ్మీద పడుకుని పెద్దకళ్ళతో నన్నే చూస్తోంది. నల్లని కళ్ళతో ఏదో అడుగున్నట్లనిపిస్తే కోటు జేబు వెతికాను. ఒక కాండీ దొరికింది. చేతికిస్తే తీసుకుంది, కానీ నోట్లో పెట్టుకోకుండా చేతిలోనే ఉంచుకుంది.

వెనక్కి తిరిగి చూస్తే భుజం మీదనుండి నన్నే చూస్తోంది. ఆ తర్వాత నాలుగైదు రోజులు కనిపించనే లేదు. అక్కడ ఆడుకుంటున్న పిల్లల్ను అడిగితే , మాకేం తెలియదన్నారు.

❦❦❦

రాత్రి రెండింటికి ఫ్లాట్ లో హాస్పిటల్ వాళ్ళిచ్చిన లాండ్ లైన్ మోగుతోంది. అంటే ఏదో కేసొచ్చిందన్నమాట. "హలో" అన్నాను.

అవతల నుండి ఎవరో ఏదో అంటున్నారు. కానీ వినిపించలేదు.

"ఎక్కడికి రావాలి" అంటే "ఎమెర్జెన్సీ" అన్నారు.

ఎమర్జెన్సీకు వెళ్ళేసరికి అక్కడంతా గందరగోళంగా ఉంది. రకరకాల పేషంటులు. డాక్టర్లూ, నర్సులూ ఖాళీ లేకుండా పరుగులు తీస్తూ పనిచేస్తున్నారు. అన్ని రకాల కేసులతో, ఎమర్జెన్సీ నిండిపోయి ఉంది.

దెబ్బలు తగిలిన వాళ్ళు, కడుపులో నొప్పితో వచ్చిన వాళ్ళు, బైకు మీదనుండి పడ్డ టీనేజ్ అబ్బాయిలు..... ఇంతకూ మా డిపార్ట్ మెంట్ కేసెక్కడుందో?

"నా పేషంట్ ఎక్కడా ?" అంటే నర్సు ఏదో కేబిన్ చూపించింది. అక్కడికి వెళ్ళి చూస్తే, ఒక ముసలి అవ్వ పడుకుని ఉంది. ఆవిడకు ఆస్త్మా ఎక్కువగా ఉంటే తీసుకుని వచ్చానని తోడుగా ఉన్న మనిషి చెప్పాడు. .

" గైనిక్ కేసుకోసం పిలిచారు ....ఎక్కడా?" అని నర్స్ ని అడిగాను. ఆమె "గైనిక్ కేసా?" అని ఆశ్చర్యపోయింది.

"ఎవర్ని పిలవబోయి ఎవర్ని పిలుస్తారో వీళ్ళకే తెలియదు." అనుకుంటూ అన్ని కేబిన్స్ వెతికి చూశాను. మాకు సంబంధించిన కేసు కనిపించలేదు.

నాపేషంట్ ను ఎక్స్ రే కోసం పంపారట. ఇంకో పావుగంటలో వచ్చేస్తుందని ఎవరో చెప్పారు.

' నేను చూడకముందు ఎవరు చూశారో? ఎక్స్ రే ఎందుకు రాశారో' అనుకుంటూ వెయిట్ చేస్తున్నాను.

ఎదురుచూస్తూ ఉంటే ఏవో అరుపులు వినిపించాయి. డా. రాధిక లోపలికి వస్తోంది. సీరియస్ గా ఎవరితోనో గట్టిగా మాట్లాడుతోంది.

"ఏం తెలియకుండా ఎలా ఉంటుంది. చెప్పు ఏం జరిగిందో?" అంటూ నిలదీస్తోంది.

ఎవరినా తను అంతలా అరుస్తోందని చూస్తే ఓ చోట తెలిసిన మొహం కనిపించింది.

ఏడేళ్ళ పాప నూర్ తో ఉండే యువతి.. దుపట్టా చేతిలోకి తీసుకుని మెలిపెడుతూ కళ్ళనీళ్ళు దాచుకోలేక ఉక్కిరి బిక్కిరి అవుతోంది.

'ఓహో ఈమేనా పేషంట్' అనుకుంటూ దగ్గరకెళ్ళాను.

"ఏమైంది? ఆమె నాకు తెలుసు" డా. రాధిక తో అన్నాను.

"చూడండి మేడం ఏమడిగినా చెప్పదు. నాకేం తెలియదంటోంది"

"ఇంతకూ ఏమైంది?"

మీరే చూడండి అంటో ఒక ఎక్స్ రే నా చేతికిచ్చింది. అప్పుడే తీసినట్టున్నారు. అదింకా తడి తడిగానే ఉంది.

ఎక్స్ రే చూస్తూ "ఎవరిదిది?" అన్నాను

అంతలోనే నా పక్కనుండి ఒక ట్రాలీ లోపలికి వచ్చింది. "ఇదిగో ఈ పాపది" అంది డా. రాధిక .

ట్రాలీ మీద నూర్. అవే పాలిపోయిన బుగ్గలు . ఎడమ బుగ్గ మీద చెదిరిన తిలకం లాగా ఒక చిన్న గాటు. పెద్దపెద్ద కళ్ళలో కలిసిపోయిన భయమూ, జాలీ.

ఎక్స్ రే లైటు కు అడ్డంగా పెట్టి చూసి

" ఇది తనదేనా?" నమ్మలేనట్టు అడిగాను.

ఎక్స్ రే లో , పొట్ట కిందిభాగంలో అయిదో , ఆరో గుండు సూదులు కనిపిస్తున్నాయి.

పాపదేనన్నట్లు తలూపింది రాధిక.

"చాలా రోజుల్నుండీ ఓపీ కి తీసుకొస్తున్నారు కడుపులో నొప్పి అని. మామూలు నొప్పి అనే అనుకున్నాం అంతా. ఎంతకూ తగ్గక పోతుంటే ఇవ్వాళ ఎక్స్ రే తీసి చూశాము." మొహమంతా చెమటలు పడుతున్నాయి తనకు.

గుండె గట్టిగా కొట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. గుండు సూదులు ఎక్కడ ఉన్నాయో అర్థం కావడం లేదు. "ఒకవేళ గౌనులో ఉన్నాయేమో?" అన్నాను రాధికతో..

"పాప గౌన్ తీసేసిన తర్వాతే ఎక్స్ రే తీశారు."

ఏమడిగినా ఏడవదు, ఏమీ మాట్లాడదు...

అవే పెద్దకళ్ళతో నన్ను అనుమానంగా చూస్తుంది. దగ్గరకువెళ్తే ముడుచుకు పోతోంది . పాలిపోయిన బుగ్గలమీద చారలేంటో, ఆ పాపను చూస్తే గుండె చెరువైపోతోంది.

చివరికి మత్తు ఇచ్చి, సూదులెక్కడ ఉన్నాయో వెదకాలని నిశ్చయించుకున్నాము.

ఆ విషయం వాళ్ళ వాళ్ళతో చెప్పి అనుమతి తీసుకోవాలి.

నూర్ వాళ్ళ తల్లిదండ్రులెవరు? ఆమె తో ఉన్న యువతి తల్లికాదనీ, భార్య చనిపోతే , నూర్ తండ్రి, భార్య చెల్లెల్ని పెళ్ళి చేసుకున్నాడనీ చెప్పారు. పాపకు పిన్ని అవుతుంది. అతను బట్టల వ్యాపారం చేస్తాడట. ఉదయం వెళ్తే రాత్రికి గానీ రాడట. ఇద్దర్నీ కూర్చోబెట్టి విషయం చెప్పాము. శరీరం లో సూదులు కనిపిస్తున్నాయనీ, అవి ఎక్కడ ఉన్నాయో మత్తు ఇచ్చి వెతకాలనీ , అవసరమైతే ఆపరేషన్ చెయ్యాల్సివస్తుందని చెప్పాను.

అతను బక్కపలచని మనిషి. మాసిన గడ్డం. వివరాలు చెప్తున్నప్పుడు, గడ్డానికి చెయ్యానించి వింటున్నాడు. వింటున్నంతసేపూ మొహం లో ఏమార్పూ కనిపించడం లేదు. చెప్తున్నది వింటున్నాడా, వింటున్నా అతనికేమైనా అర్థం అవుతోందా అన్న అనుమానం వచ్చింది.

అతను ఏమ్మాట్లాడకపోవడంతో " మీరు సంతకం పెడితే , మిగతాది మేము ఏర్పాటు చేస్తాము" అని చెప్పాను. అకస్మాత్తుగా లేచాడు. పక్కనే కూర్చున్న యువతి చెయ్యి పట్టి , ఒక్క గుంజు గుంజాడు. ఆమె కుర్చీలోనుంచి పడిపోతే, లేవదీసి చెంపమీద లాగికొట్టాడు. ఆమె కెవ్వుమని అరిచి పారిపోబోయింది. 'పిల్లను సరిగా చూసుకోకుండా ఏం చేస్తున్నావని' జుట్టు పట్టుకుని కొడుతున్నాడు. మేమంతా ఆపే లోపల ఆమెకు నాలుగైదు బలమైన దెబ్బలు పడ్డాయి. పెదవి చితికింది. గోడకానుకుని ఏడుస్తోంది. ఆమెను చూస్తే జాలేసింది. సెక్యూరిటీ వాళ్ళొచ్చి అతన్ని బయటకు పంపించారు. మనసంతా ఏదోలా అయింది. రాధిక ఆ గొడవకు బెదిరిపోయింది. లోపలకు పరుగెత్తి వణికిపోతూ కూర్చుంది.

ఆ గోలంతా సద్దుమణిగాక, పాపను థియేటర్ కు తీసుకెళ్లాము. థియేటర్ కు వెళ్ళబోతూ , రాధికను రమ్మనమని పిలిస్తే, "నా వల్లకాదండీ, నేను చూడలేనని" అక్కడే కూర్చుంది. మత్తు ఇచ్చిన తర్వాత శరీరమంతా వెతికితే, ....ఓ చోట సూదులు దొరికాయి.

ఎక్కడ దొరికాయంటే ...

పాపతో ఎవరో ఆడుకున్నారు. ఆమె జన్మమార్గాన్ని ఆటస్థలంలా చేసి ఆడుకున్నారు. ఆటవస్తువులు కూడా అక్కడే దాచారు.

ఎర్రగా కాల్చిన సూదితో గుండెల్లో ఆపకుండా పొడుస్తున్న భావన.

నేను ఆపరేషన్ నోట్స్ రాస్తుంటే పక్కనే వచ్చి నుంచుంది. ఇంకా భయం తగ్గినట్టులేదు. విప్పారిన కళ్ళతో నేను రాసినదంతా చదివి, నా పక్కనే ఉన్న బెంచీమీద కూలబడి "ఏంటండీ ఇదంతా?" అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది డా. రాధిక ..

తర్వాత నూర్ కోలుకోవడానికి ఓ వారం రోజులు పట్టింది. ఆ వారం రోజులూ పిల్లలవార్డులో ఉన్న నూర్ ని చూడడానికి వెళ్ళినప్పుడు రాధికతో కాసేపు మాట్లాడి వచ్చేదాన్ని. ఆ సంఘటన తర్వాత రాధికతో నా పరిచయం , స్నేహంగా మారింది.

రాధిక వాళ్ళ అన్నయ్య రాజకీయాల్లో ఉండడం, వల్ల, అతనికున్న పరిచయాల వల్ల శిశు సంక్షేమ శాఖా మంత్రితో వ్యక్తిగతంగా అప్పాయింట్ మెంట్ తీసుకుని , ఆమె విషయాన్ని వివరించింది. తండ్రికి చూసుకునే వీలులేదు. పినతల్లికి అంతగా తెలివిలేదు. వాళ్ళ సంరక్షణలో నూర్ ఉండడం అంత క్షేమం కాదని , ఆమెను ప్రత్యేకమైన సంరక్షణలో ఉంచే ఏర్పాట్లు చేసింది.

ఆ తర్వాత రాధిక పెళ్ళిచేసుకుని స్వంత జిల్లాలో ప్రాక్టీసు పెట్టింది. భర్త గుండె జబ్బుల డాక్టర్ . అతనికి కి విపరీతమైన ప్రాక్టీస్. తన హాస్పిటల్ , అతని ప్రాక్టీసు, అతని మంచిచెడ్డలు చూసుకోవడానికే టైం సరిపోవడం లేదని ఫోన్ లో చెప్తుండేది. ఇద్దరం కలిసి కూడా చాలా ఏళ్ళైంది.

రెండుమూడేళ్ళ క్రితం కాబోలు వాళ్ళ కొత్త ఇంటి గృహప్రవేశానికి పిలిచింది. తప్పకుండా రావాలని చెప్పింది. ఎంతో మంది వస్తారు. వాళ్ళతో పాటు వెళ్తే కనీసం 'హలో' చెప్పడానికి కూడా కుదరదని వెళ్ళలేదు. ఆ తర్వాత వేరే పనిమీద ఆ వూరెళ్ళాల్సి వచ్చింది. దీపావళికి ముందూ వెనకా ఇంకా ఏవో సెలవలు కూడా వస్తే అవికూడా కలుపుకుని వెళ్ళాలనుకున్నాను. వెళ్ళబోయే ముందు, ఇలా వస్తున్నానని రాధికకు ఫోన్ చేసి చెప్పాను.

నేను వెళ్ళిన రోజు పనులన్నీ జూనియర్స్ మీద వదిలి, నన్ను తీసుకుని ఉదయాన్నే కార్లో బయలు దేరింది. ఎక్కడికి అంటే చెప్తాగా అంటూ హోటల్ కు తీసుకెళ్ళి స్విమ్మింగ్ పూల్ పక్కన కూర్చోబెట్టి బ్రేక్ ఫాస్ట్ తినిపించింది. ఉరుకుల పరుగుల జీవితం లో ఏరోజూ అంత తీరికగా బ్రేక్ ఫాస్ట్ చేసిందే లేదు. ఇద్దరం ఆ మాటే అనుకున్నాం. ఇలా తీరికగా కూర్చుని తినడానికి, ఇకనుండీ ఇద్దరం ఆర్నెల్లకోసారి సెలవు తీసుకోవాలనుకుని నవ్వుకున్నాం.

ఆ రోజు టీవీ చానల్ లో తన హెల్త్ షో ఉందనీ, అక్కడకు వెళ్ళాని చెప్పి నన్ను కూడా తీసుకెళ్తోంది. అక్కణ్ణుంచి ఏవో కబుర్లు చెప్పుకుంటూ కార్లో వెళ్తున్నాం. తనే డ్రైవ్ చేస్తోంది. ఓ పెద్ద ఆవరణలోకి తీసుకెళ్ళింది. ఆ న్యూస్ చానల్ వాళ్ళన్నయ్యదేనట .

" జస్ట్ ఒక్క అరగంట కూర్చో చాలు. ఎప్పటిదో కమిట్ మెంట్. ఎగ్గొట్టితే బాగోదు" అంటూ నన్ను కూర్చోబెట్టింది.

ఎవరో వచ్చి మేకప్ రాధికకు వేస్తున్నారు. న్యూస్ రూం లోకి తీసుకెళ్ళింది. అక్కడ తన ప్రోగ్రాం మొదలవ్వడానికి ముందు న్యూస్ వస్తున్నాయి. నల్లని సూట్ వేసుకున్న న్యూస్ రీడర్ వార్తలు చదువుతోంది. రాధిక లైవ్ ప్రోగ్రాం ఇవ్వడానికి వీలుగా స్పీకర్ ఫోన్స్, అవీ ఏర్పాటు చేశారు.

న్యూస్ చదవడం అయిపోయిన తర్వాత, న్యూస్ రీడర్ ఏవో పేపర్లు అవీ తీసుకొచ్చి రాధికకు అందజేసింది. ప్రేక్షకులనుండి ఫోన్లు అందుకునే ముందు , ఓ పావుగంట సేపు ఒక టాపిక్ మీద మాట్లాడుతుందట. పేపర్ లో ఉన్న తెలుగు మాటర్ గబగబా చూసుకుంది. ఆ తర్వాత, ఫోనుల్లో సలహాలు ఇంకో అరగంట. ప్రోగ్రాం అయిపోవడానికి మొత్తం ఓ నలభై నిముషాలు పట్టింది.

అంతా అయిన తర్వాత ఓ రూం లో కూర్చోబెట్టి కాఫీ తెప్పించింది. ఇందాకటి న్యూస్ రీడర్ వచ్చి,

"మేడం, వచ్చే వారం ప్రోగ్రాం వివరాలు" అంటూ వేరే కొన్ని పేపర్స్ అందించింది.

వాటివంక ఓ నిముషం చూసి, నావైపు తిరిగి,

"టీవీ చూస్తావా ఎప్పుడైనా? ఈ అమ్మాయెవరో గుర్తుపట్టావా?" అంది.

గుర్తుపట్టానన్నట్లు తలూపి , "టీవీ పెద్దగా చూడను. ఇందాక న్యూస్ చదివింది ఈ అమ్మాయేగా...పేరేంటమ్మా?" అని ఆ అమ్మాయినడిగాను..

"నా పేరు సమీర మేడం." అంది.

అక్కణ్ణుంచి బయటికొచ్చి కార్లో కూర్చుంటే డ్రైవర్లు వచ్చారు సహాయం చేస్తామని. అక్కర్లేదంది. నిజమే డ్రైవర్లుంటే గట్టిగా నవ్వుకోవడానికుండదు. ఏదిబడితే అది మాట్లాడుకోడానికుండదు.

నేను కార్లో సర్దుకుని కూర్చోగానే, కారు స్టార్ట్ చెయ్యకుండా , రాధిక మెయిన్ డోర్ వైపు చూస్తోంది.

"ఏమైంది?" అడిగాను.

ఏమీ లేదన్నట్టు అడ్డంగా తలూపి,

"ఎలా ఉంది...మీ ..నూర్ ?" అని అడిగింది.

గుండె గతుక్కుమంది. ఎప్పటికీ మర్చిపోలేని పేరు.

"నూర్ ....నూర్ ఎవరూ?" అన్నాను కంగారుగా

"న్యూస్ రీడర్."

"ఆ అమ్మాయి సమీర అందీ?"

"ఆ టైం లోనే తన పేరు మార్చేశాము. తనకా జ్ఞాపకాలేమీ గుర్తుండకూడదని."

"తనని చూడాలి." అంటూ కారు దిగబోయాను.

నన్ను వారించి , "ఉండు... ఇంకో నిముషంలో...తనే వస్తుంది."

"ఎందుకొస్తుంది?"

"నువ్విలా అడుగుతావని తెలుసు, అందుకనే కావాలని నా బాగ్ ఆఫీసులో మర్చిపోయాను."

రాధిక చెప్పినట్టే ఆ అమ్మాయి చేతిలో బాగ్ పట్టుకుని పరుగు పరుగున మెట్లు దిగి మా కారు వైపు వస్తోంది.

వెంటనే కారు దిగాను. రాధిక కూడా కారు దిగి, నావైపు వచ్చింది. ఆ అమ్మాయి అందించిన బాగ్ తీసుకుని ,

" మేడం నాకు చాలా ముఖ్యమైన ఫ్రెండ్. మనతో దీపావళి సెలెబ్రేట్ చేసుకోవడానికి వచ్చారు." ఆమెకు నన్ను మళ్ళీ పరిచయం చేసింది.

సంతోషంగా చిరునవ్వు నవ్వింది సమీర ....... నూర్....... చిన్నారి నూర్.

నూర్...నువ్వేనా నూర్...గుండె లో గుబులు కెరటంలా లేచి, గుండెంతా కమ్ముకుంది...

ఆమె బుగ్గ మీద అస్పష్టమైన గాటు , ఆమె పెద్ద పెద్ద కళ్ళు .......చూస్తూ మైమరచిపోయాను. వళ్ళు గగుర్పొడిచింది. చక్కగా ఎదిగిన పూల కొమ్మలా ఉన్న నూర్ ని అంత దగ్గరగా చూస్తుంటే రాధిక మీద ప్రేమ , గౌరవంతో మనసంతా నిండింది.

ఆమెతో నా పరిచయం చెప్పుకునేది కాదు. . ఆమెను అలాగే చూస్తూ కార్లో కూర్చున్నాను. నూర్ దగ్గరకొచ్చి, డోర్ వేసేసి "దీపావళి శుభాకాంక్షలు" మేడం. అంది నవ్వుతూ తన నవ్వుతో, నా గుండెల్లో మతాబాల వెలిగాయి . నా కళ్ళల్లోంచి వాటి తాలూకు రవ్వలు. అవి కనపడకుండా రెప్పలు వాల్చి తలూపాను.

Post your comments